క్లుప్తంగా

కర పత్రాల పంపిణీ



పెర్కిట్(ఆర్మూర్): పల్లె పల్లెకు ఓబీసీ– ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆలూర్ మండలం దేగాం, మచ్చర్ల, గగ్గుపల్లి, మిర్దాపల్లి, ఇస్సాపల్లి గ్రామాల ప్రజలకు ఆదివారం బీజేపీ నాయకులు కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం ఓబీసీలకు చేసిన పనులను ప్రజలకు వివరించారు. నాయకులు విఘ్నేశ్వర గౌడ్, సురేష్, ప్రణీత్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..



భీమ్‌గల్:చేంగల్, గోన్‌గొప్పుల, సికింద్రాపూర్, రూప్లాతండా గ్రామాల్లోని అర్హులైన లబ్ధిదారులకు జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్యల ఆధ్వర్యంలో శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శివసారి నర్సయ్య, రైతుబంధు మండల అధ్యక్షుడు శర్మ నాయక్, జెడ్పీ కో–ఆప్షన్ మోయిజ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



భీమ్‌గల్: మండలంలోని పల్లికొండ గ్రామానికి చెందిన కర్రోళ్ల సుమన్ ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో మరణించాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. వారి ఆర్థిక ఇబ్బందులను గమనించి 2005–06 సంవత్సర కాలంలో సుమన్‌తో కలిసి చదువుకున్న స్నేహితులు ఆదివారం రూ.లక్ష ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా సుమన్ స్నేహితులు మాట్లాడుతూ.. పిల్లల చదువుకు ఉపయోగపడటానికి ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ప్రశాంత్, సుకేష్, సుభాష్, కిషన్, నవీన్, విజయ్, దిలీప్, సాగర్, గణేష్ పాల్గొన్నారు.

సభలను విజయవంతం చేయాలని పిలుపు

ధర్పల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఈనెల 25, 26, 27లలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ధర్పల్లి మండల కేంద్రంలో ఆదివారం ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు గంగారెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని ఈరోజు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని పేర్కొన్నారు. పేరుకు మాత్రమే పాలకులు రైతు జపం చేస్తున్నారని వ్యవసాయరంగాన్ని పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు కట్టబెట్టారని విమర్శించారు.

'ఎక్సైజ్ అసోసియేషన్‌తో సంబంధం లేదు'

ఖలీల్‌వాడి: ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ చిట్టి నారాయణరెడ్డి, ఎక్సైజ్ అసోసియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, చంద్రమోహన్ ఆదివారం తెలిపారు. డ్రెస్ కోడ్ ఉన్న ఉద్యోగులకు టీఎన్‌జీవోస్ బైలా ప్రకారం సంఘంలో సభ్యత్వం ఉండకూడదని, కానీ ఎక్సైజ్ పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ చిట్టి నారాయణరెడ్డి టీఎన్‌జీవోస్ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఆయనకు ఎక్సైజ్ అసోసియేషన్‌లో ఎలాంటి పదవి లేదని, బైలా ప్రకారం టీఎన్‌జీవోస్ పోస్టులో కొనసాగరాదని స్పష్టం చేశారు. టీఎన్‌జీవోలో కొనసాగుతూ ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా తమకు సంబంధం లేదన్నారు.

11న విద్యుత్ ఉద్యోగుల సన్నాహక సమావేశం

నిజామాబాద్ నాగారం : టీఎస్‌పీఈజేఏసీ పిలుపు మేరకు ఈనెల 17న విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు వెళ్తున్న దృష్ట్యా ఈనెల 11న నగర శివారులోని పీహెచ్ఆర్ కన్వెన్షన్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రకటన విడుదల చేశారు. 11న మధ్యాహ్నం 2 గంటలకు తప్పనిసరిగా ప్రతి విద్యుత్ ఉద్యోగి సన్నాహక సమావేశానికి హాజరు కావాలని తమ డిమాండ్లను సాధించుకునే దిశగా చర్చల్లో పాల్గొనాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

జిల్లాలోని పలు చర్చిలలో ఆదివారం ఈస్టర్ పండుగను క్రైస్తవులు, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే రోజున సిలువపై మరణించిన యేసు క్రీస్తు తిరిగి మూడవ రోజున ఆదివారం పునరుత్థానుడై లేచిన రోజును ఈస్టర్‌గా జరుపుకున్నారు. పాస్టర్లు ఈస్టర్ సందేశాన్ని వినిపించారు. చిన్నారులు నృత్యాలు చేశారు. యువతీ యువకులు ప్రత్యేక పాటలు పాడారు. – వేల్పూర్/బోధన్‌టౌన్/పెర్కిట్



పడగల్ సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



బోధన్‌లోని సీఎస్ఐ చర్చి ఆవరణలో క్యాండిల్ ర్యాలీ



జాన్కంపేట్ ఐజీసీ చర్చిలో నృత్యాలు



గోవింద్‌పేట్ రాక్ చర్చిలో ప్రార్థనలు

అభివృద్ధి పనులకు భూమిపూజ



భీమ్‌గల్: భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు



వేల్పూర్‌లో .. బీఆర్ఎస్ నాయకులు

భీమ్‌గల్: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్యల ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహాయంతో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. రైతు బంధు మండల అధ్యక్షుడు శర్మ నాయక్, సొసైటీ చైర్మన్ శివసారి నర్సయ్య, జెడ్పీ కో–ఆప్షన్ మోయిజ్ పాల్గొన్నారు.

వేల్పూర్: మండల కేంద్రంలో రూ.23 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద ఉన్న కేసీఆర్ కల్యాణం మండపానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.15 లక్షలతో నిర్మించే ప్రహరీ గోడ, సీడీపీ నిధులు రూ.8 లక్షలతో నిర్మించే మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీపీ బీమజమున, నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు సామ మహిపాల్, మిట్టపల్లి మహిపాల్, రేగుల్లరాములు, నాగధర్, సర్పంచ్ తీగల రాధామోహన్, ఎంపీటీసీ మొండి మహేశ్, ఉపసర్పంచ్ పిట్లసత్యం పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కోనాసముందర్‌లో ప్రారంభిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

కమ్మర్‌పల్లి : కోనాసముందర్‌లో స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సామ బాపురెడ్డి, జెడ్పీటీసీ రాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు బోధన్‌లో.. ఎమ్మెల్యే చేతుల మీదుగా..

బోధన్: పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ చేతుల మీదుగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్ ఆదివారం తెలిపారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్: మండలంలోని రాయకూర్, రుద్రూర్ గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఎంపీపీ అక్కపల్లి సుజాతనాగేందర్, జెడ్పీటీసీ సరోజ గంగారాం తెలిపారు. రైతులు తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్టపోవద్దని వారు సూచించారు. మద్దతు ధర పొందాలని చెప్పారు.

అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ



బెటి గల్లీలో రోడ్డుపై వేసిన చెత్త

- ఆర్మూర్ పట్టణంలో రోడ్లపైనే చెత్త వేస్తున్న పలువురు
- పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయి సిబ్బందికి వదిలేయడంతో అధ్వానంగా తయారైంది. పట్టణంలోని 36 వార్డుల్లోని పలు కాలనీల్లో దుర్గంధంతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ పారిశుధ్య కార్మికులు చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలి. కాని కొన్ని వార్డుల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్లపైనే చెత్తచెదారం దర్శనమిస్తోంది. రోడ్లపై చెత్తను వేయడంతో పందులు, కుక్కలు వ్యర్థాలను తినేందుకు వచ్చి గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై వేస్తున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి ప్రజలు అనారోగ్యం బారినపడకుండా చూడాలని పుర ప్రజలు కోరుతున్నారు. గత కొన్ని రోజులుగా అకాల వర్షాలు పడటంతో పాటు ఎండలు ఎక్కువ కావడం, వాతావరణంలో మార్పులు సంభవించడంతో ప్రతిఇంట్లో విష జ్వరాల బారినపడుతున్నారు. వివిధ రకాల సమస్యలతో చిన్న పెద్ద అని తేడా లేకుండా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో పారిశుధ్య నిర్వహణ బాగుంటే మంచిదని స్థానికులు అంటున్నారు. పట్టణంలోని మల్లారెడ్డి చెరువు సమీపంలో, హుస్నాబాద్ కాలనీలో, జిరాయత్ నగర్‌లో చెత్తను రోడ్డుపైనే వేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'జిల్లా' ఏర్పడే వరకు ఉద్యమం ఆగదు



బోధన్: బోధన్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తు జిల్లా సాధన సమితి అధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం నాటికి 112 వ రోజుకు చేరాయి. బోధన్ జిల్లా ఏర్పడే వరకు ఉద్యమం, దీక్షలు ఆగవని ఈ సందర్భంగా న్యాయవాదులు పేర్కొన్నారు. దీక్షలో న్యాయవాదులు గంగారెడ్డి, శంకర్‌లు కూర్చున్నారు. సీనియర్ న్యాయవాది సీహెచ్‌వీ హన్మంత్‌రావు దీక్షలను ప్రారంభించారు.

అవార్డు గ్రహీతకు ఆత్మీయ సన్మానం



నవీపేట: దళిత రత్న అవార్డు పొందిన బీఆర్ఎస్ జిల్లా నాయకులు తెడ్డు పోశెట్టిని ఆదివారం ఆత్మీయులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని రఘుపతిరెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెడ్డు పోశెట్టి దంపతులను సన్మానించారు. పాఠశాల స్థాయిలోనే హాస్టల్‌లో ఉంటూ విద్యారంగ సమస్యలపై పోరాడిన తెడ్డు పోశెట్టి పట్టు వదలకుండా నేటికీ పోరాడుతూనే ఉన్నారని ఈ సందర్భంగా కొనియాడారు. నేటి యువ నాయకులు తెడ్డు పోశెట్టిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాంకిషన్‌రావ్, జిల్లా నాయకులు భవంతి దేవిదాస్, మండల నాయకులు నర్సింగ్‌రావ్, న్యాలకంటి అబ్బన్న పాల్గొన్నారు.

నారాయణ కుటుంబానికి అండగా ఉంటాం

బోధన్‌టౌన్(బోధన్): సీనియర్ ఫొటోగ్రాఫర్ నారాయణ మృతి తీరని లోటని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని నిజామాబాద్ జిల్లా, బోధన్ పట్టణ ఫొటో స్టూడియో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్, అనీల్ గౌడ్‌లు అన్నారు. ఆదివారం ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర అసోషియేషన్ ఆధ్వర్యంలో కుటుంబ భరోసా పథకం కింద వారికి కుటుంబానికి రూ.లక్షా 35 వేల ఆర్థిక సహాయం అందించారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే షకీల్



ఏఎంసీ చైర్మన్‌కు పండు తినిపిస్తున్న ఎమ్మెల్యే

బోధన్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి పట్టణంలోని 12వ వార్డులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమెర్ పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసీపీ కిరణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, కౌన్సిలర్లు, మత పెద్దలు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతుల్లో పంటల సాగు



డిచ్‌పల్లి: మానవాళి ఆరోగ్యానికి హానికరంగా మారిన రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి రైతులు సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు నూతన శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఘన్‌పూర్‌లో మండల కిసాన్‌మోర్చా అధ్యక్షుడు చౌకి లక్ష్మణ్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ ఎరువులు తయారీ, వాడకం, లాభాలపై రైతులకు శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. సదస్సులో జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, సీనియర్ నాయకులు విఠల్, సురేష్, సాయిబాబా, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కన్పించడం లేదా?

- ప్రతిపక్ష నేతలకు బీఆర్ఎస్ నేతల సూటి ప్రశ్న



రుద్రూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రుద్రూర్ : బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు ప్రతిపక్ష నాయకులకు కనపడటం లేదా అని మండల బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. సోయి లేకుండా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రుద్రూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం వారు మాట్లాడారు. వర్ని ప్రాంతంలో ముందస్తు వరి ధాన్యం చేతికి వస్తుందనే స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి మూడు రోజుల క్రితమే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. మిగతా మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని బద్నామ్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రతిపక్ష నాయకులు స్పీకర్‌పై ఆరోపణలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. నాయకులు తోట్ల గంగారాం, షేక్ ఖాదర్, మోహన్, కోడె సుభాష్, సయ్యద్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

పతంజలి యోగా కేంద్రం ఆధ్వర్యంలో మట్టిస్నానం



మట్టి పూసుకుని యోగాసనాలు వేస్తున్న స్థానిక ప్రజలు

రుద్రూర్: మండల కేంద్రంలో గంగమ్మ గుడి సమీపంలో పతంజలి యజ్ఞ సహిత యోగ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మట్టి స్నానం కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. స్థానిక సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్‌తో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, యువకులు, పిల్లలు కార్యక్రమానికి హాజరై మట్టి స్నానం చేశారు. మట్టి స్నానం ఆచరించిన తర్వాత పతంజలి సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ మహాజన్ మాట్లాడుతూ.. పంచ మహా భూతాలలో ఒకటైన భూమి చాలా అమూల్యమైనదని, భూమిపై ఉన్న పుట్టమన్ను, చెరువు మట్టిని శరీరానికి పూసి ఒక గంట సేపు సూర్యుడి ముందు నిలబడి యోగ, ప్రాణాయామం చేయడం వల్ల వివిధ రకాల చర్మరోగాలు నయమవుతాయన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కేవీ మోహన్, ప్రభుత్వ టీచర్లు బాల్‌రాజ్, శంకర్, వివేక్, ఆర్టీసీ ఉద్యోగులు సాయిలు, రాములు, పతంజలి సభ్యులు పురుషోత్తం, ఆర్కే శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ధ్యాన మందిరం ప్రారంభం



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం గగ్గుపల్లి గ్రామంలో పీఎస్ఎస్ఎం నవనాథపురం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కైలాస రుద్ర ధ్యాన మందిరాన్ని ఆదివారం ప్రారంభించారు. నందిపేట కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగి రాములు మహారాజ్ ముఖ్య అతిథిగా హాజరై ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానం వల్ల ఆరోగ్యంతో పాటు ఆనందం ప్రాప్తిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ శాఖాహారం స్వీకరిస్తూ క్రమం తప్పకుండా ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఉయ్యూరు శోభారాణి, నల్ల గంగారెడ్డి, న్యాయవాది సాయికృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, అమరవాజి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీడీసీ ఆధ్వర్యంలో బోనాల పండుగ



నవీపేట: బినోల గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి, ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పీతాంబర్, ఉప సర్పంచ్ పోశెట్టి, మాజీ ఎంపీటీసీ మహేందర్, సొసైటీ డైరెక్టర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో యజ్ఞం

నవీపేట: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక యజ్ఞం నిర్వహించారు. మహిళా పురోహితులు గాయత్రి ఆధ్వర్యంలో యజ్ఞ క్రతువును నిర్వహించారు. యజ్ఞాలతో వాతావరణ కాలుష్య నివారణ జరుగుతుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్య సమాజ్ మండల ప్రతినిధులు గంజి సాయన్న, నాంపల్లి వసంత్, నరేంద్రశేఖర్, ధీరేంద్ర మహారాజ్, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాచారం..

బోధన్‌లో ధర్మస్థలం భవన ప్రారంభోత్సవం

బోధన్: బోధన్‌కు చెందిన ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయురాలు గుర్రాల సరోజనమ్మ సొంత డబ్బులు రూ. 20 లక్షలతో స్థానిక చెక్కి చెరువు ప్రాంతంలో నిర్మించిన ధర్మ స్థలం నూతన భవనం సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నారు. ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, కమిషనర్ ఖమర్ అహ్మద్, కౌన్సిలర్లు నాగవర్ధిని సత్యం, సంధ్యా దామోదర్‌రెడ్డి, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులను ఆహ్వానించినట్లు ఆమె తెలిపారు.

11న కౌలు వేలం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఏక చక్రేశ్వర మందిరానికి చెందిన సాగు భూముల వేలం ఈ నెల 11న ఉదయం 11 గంటలకు ఆలయంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రవీందర్ గుప్తా, పాలక మండలి చైర్మన్ బీర్కూర్ శంకర్ తెలిపారు. ఆసక్తి గల వారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాల్సిందిగా కోరారు.

16న క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

బోధన్: బోధన్‌కు చెందిన ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో ఈ నెల 16న రాత్రి 7 గంటలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ కాలనీలో సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నిరుపేదలకు ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించామని ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఆరోగ్య జ్యోతి తెలిపారు. యూపీఐ ద్వారా ఆర్థిక సహాయం అందించాలనుకునే వారు 9959263964కు విరాళం పంపించాలన్నారు. 9908401657, 7842582824లో సంప్రదించాలన్నారు.